సాక్షి జోగులాంబ గద్వాల

శనివారం। 14। జూన్। 2025



ప్రాణం పోద్దాం
అత్యవసర సమయంలో చేసే రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలుపుతుంది.

వివరాలు 8లో ▸



ఉత్సాహంగా ఈవెంట్స్
పీయూలో నిర్వహిస్తున్న టీజీపీఈసెట్ ఈవెంట్స్ ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /24.7

వాతావరణం
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

మోయలేని భారం!

ప్రైవేటు పాఠశాలల్లో ఎడాపెడా ఫీజుల మోత

- సామాన్యుడి ఆదాయంలో 40 శాతం పిల్లల చదువులకే..
- ఫీజుల నియంత్రణ జీఓ 91 అమలెక్కడ
- విద్యాహక్కు చట్టానికి తూట్లు



జిల్లాలో మొత్తం ప్రైవేటు స్కూల్స్ :	విద్యార్థుల సంఖ్య
125	46,834

గద్వాలటౌన్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణతోపాటు పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించే లక్ష్యంగా ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టం తెచ్చినా.. జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలు ఈ చట్టాన్ని బేఖాతరు చేస్తున్నాయి. ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం రోజురోజుకు అధికమవుతుంది.

జీఓ 91పై కొరవడిన నియంత్రణ

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం జీఓ 91ని జారీ చేసి ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో నియంత్రణ కొరవడింది. రోజు కూలి నుంచి ఉన్నత ఉద్యోగుల దాకా తమ పిల్లలను పేరున్న ప్రైవేటు పాఠశాలల్లో చదివించాలని తపన పడటం సహజం. తల్లిదండ్రుల ఆరాటాన్ని యాజమాన్యాలు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఫీజుల మోత నాలుగురెట్లు పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఫీజులను 20 నుంచి 30శాతం పెంచేశారు. జిల్లాలోని ప్రైవేటు బడుల్లో సుమారు 40 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ 91 విడుదలైంది. దీని ప్రకారం రెండు కేటగిరీల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలను వేరు చేస్తూ రూ.8వేలు, రూ.12వేలు ఫీజులుగా నిర్ణయించారు. కానీ ఈ ఫీజులను జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమానులు పట్టించుకోవడం లేదు.

ఇదీ జరుగుతోంది..

పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లను జిల్లాలోని ఏ ఒక్క ప్రైవేటు పాఠశాల కేటాయించడం లేదు. ఎక్కడా లాటరీ పద్ధతిలో ప్రవేశాలు జరగడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ స్థాయి పాఠశాలలు బహిరంగంగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా అడిగేవారు లేరు. పాఠశాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, క్రీడలు, పరీక్ష ఫీజు, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇంతవరకు అధికారుల ఆధ్వర్యంలోని కమిటీ కూర్చుని చర్చించకపోవడం గమనార్హం. ఇక పాఠశాల స్థాయిని బట్టి విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రాధాన్యత తక్కువ ఉన్న పాఠశాలలో ఎల్‌కేజీకి రూ.10వేలు, ఓ మోస్తరు పాఠశాలలో రూ.15వేలు, డిమాండ్ అధికంగా ఉన్న పాఠశాలలో రూ.20వేల నుంచి రూ.25వేలు వసూలు చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిని బట్టి రూ.30 వేల నుంచి రూ.60 వేలు వసూలు చేస్తున్నారు. దీనికితోడు యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, షూస్, టై, బెల్టులను ఆయా పాఠశాలల సమీపంలో అనుబంధంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. పాఠశాల పేరుతో ముద్రించినవి కావడంతో తల్లిదండ్రులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

అకాశాన్నంటుతున్న పుస్తకాల ధరలు

ఒకటి నుంచి ఐదో తరగతి దాకా పుస్తకాల భారం సైతం తల్లిదండ్రులపై మోపుతున్నారు. ఒక పుస్తకం ప్రింటింగ్ ధర రూ. 200 ఉంటే దాన్ని విక్రయించే పాఠశాలలకు సగం ధరకే వస్తుంది. కానీ దానిని రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ఇలా మొత్తం పుస్తకాలను రూ.4వేల నుంచి రూ. 8వేల దాకా విక్రయిస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి దాకా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సిలబస్ ఉంటుంది. వీరికి ప్రభుత్వ పుస్తకాలు సరఫరా చేస్తారు. అయితే ఐఐటీ, ఒలంపియాడ్ అంటూ కొన్ని ప్రత్యేక పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నారు. దీనికి తోడు వర్క్‌బుక్ పేరుతో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రైవేటు ఏజెన్సీల పుస్తకాలను అంటగడుతున్నారు. ఫీజులు, పుస్తకాల మోత ఒకెత్తయితే రవాణా చార్జీల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులపై యేటా రూ. 6వేల నుంచి రూ. 10వేల దాకా భారం పడుతోంది. ఉదాహరణకు ఒక కి.మీలోపు ఉంటే విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి రవాణా ఛార్జీల పేరిట రూ.4 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నారు.

ఫీజుల నియత్రణపై ప్రత్యేక దృష్టి



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే ఆయా పాఠశాలలకు మౌఖిక ఆదేశాలు జారీ చేశాం. ఫీజుల నియంత్రణలో ఎలాంటి ఒత్తిళ్లకు చోటివ్వడం లేదు. వీటితో పాటు అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయాలు, బస్సుల ఫీజులు, ఇతరాత్ర ఫీజులపై దృష్టి సారించి కఠినంగా వ్యవహరిస్తాం. – అబ్దుల్ ఘనీ, డీఈఓ

న్యూస్‌రీల్

పంట మార్పిడితో దిగుబడులు



అలంపూర్: రైతులు పంట మార్పిడి పాటించాలని, అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈశ్వర్‌రెడ్డి, శ్రీధర్ అన్నారు. అలంపూర్ మండలంలోని లింగనవాయిలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం శుక్రవారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి శాస్త్రవేత్తలతోపాటు పశుసంవర్ధక అధికారి డాక్టర్ శంకరయ్య, ఉద్యానవన శాఖ అధికారి ఇమ్రాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వ్యవసాయంలో అవసరం మేరకు రసాయన మందులు వినియోగించాలన్నారు. రసాయన మందుల పిచికారీలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట సాగులో యూరియా తక్కువ మోతాదులో వాడాలన్నారు. రైతులు పంట సాగుకు తెచ్చుకునే ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల రశీదులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని, వ్యవసాయంలో నీటి ఆదా చేయాలని, సమగ్ర సస్యరక్షణ చేపట్టి మంచి దిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు మోహన్ రెడ్డి, రాఘవరెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,016 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా జలాశయానికి నీటి సరఫరా లేదని.. రామన్‌పాడు నుంచి కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూ సెక్కులు వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

రైతు హక్కులను బలపరిచే.. కొత్త విత్తన చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

నడిగడ్డ సీడ్ పత్తి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- సీడ్ కంపెనీలు ఆర్గనైజర్ వ్యవస్థను ప్రోత్సహించడం సరికాదు
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పంటల పరిశీలనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం

గద్వాలటౌన్: రైతులు ఎదుర్కొంటున్న పత్తి విత్తనాల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా, కంపెనీలపై నియంత్రణతో పాటు రైతు హక్కులను బలపరిచే కొత్త విత్తన చట్టం త్వరలో అమలులోకి రానుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన విత్తన పత్తి పంటకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు, సమస్యల పరిష్కారానికి అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు శ్రమతో సాగు చేస్తున్న పత్తి పంట దేశీయంగా మాత్రమే కాకుండా చైనా వంటి దేశాలకు పోటీ ఇవ్వగల స్థాయిలో ఉందని చెప్పారు. నడిగడ్డలో పత్తి రైతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవడానికి వచ్చామన్నారు. రైతు విత్తనాలు ఫెయిల్, అధిక వడ్డీ రేట్లు, అప్పుల తాకట్టుతో అప్పుల్లో కూరుకుపోతూ ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి బాధించిందని అన్నారు. జీఓటీ విధానాన్ని సీడ్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని రైతులను మోసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత చట్టాలలో జీఓటీ విధానమే లేదన్నారు.

సీడ్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దు



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న చైర్మన్

ములుగు జిల్లాలో మొక్కజొన్న సమస్యపై కమిషన్ స్పందించి ఆదివాసులకు న్యాయం చేశామని, అదే తరహాలో నడిగడ్డలో సీడ్ పత్తి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీడ్ కంపెనీలు చట్టాలను ఉల్లంఘించి ఆర్గనైజర్ వ్యవస్థను ప్రోత్సహించడం తగదని ఆయన అన్నారు. రైతులు పండిస్తేనే సీడ్ కంపెనీలు రూ.కోట్లు ఆర్జిస్తున్నాయని, అలాంటిది సీడ్ కంపెనీలు రైతు నుంచి ఎందుకు అగ్రిమెంట్ చేసుకోవడం లేదని నిలదీశారు. చట్ట విరుద్ధంగా ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా సీడ్ ఆర్గనైజర్లను ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పత్తి రైతులకు అప్పు ఇచ్చే ఆర్గనైజర్లు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాలని కలెక్టర్ పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ కంపెనీల నుంచి స్పష్టమైన డేటాను సేకరించి, ఫెయిల్యూర్ అయిన విత్తనాలపై పూర్తి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మనీ లాండరింగ్ చట్టం, అగ్రిమెంట్లపై స్పష్టత కోసం ఎస్‌ఓపీ తయారు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు, వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్గనైజర్ల తీరుపై ఆగ్రహంవ్యక్తం చేశారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ, కమిషన్ సభ్యులు రాములునాయక్, సునీల్‌కుమార్, రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్, నర్సింహారెడ్డి, భవాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్వాదం.. తోపులాట



సీఐతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకుడు విజయ్‌కుమార్

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుల బృందం గద్వాల మండలం పుటాన్‌పల్లి సమీపంలో పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటుండగా.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ సీడ్ పత్తి రైతుల సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. విజయ్‌కుమార్ వెంట వచ్చిన వారిపై దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు వర్గాల వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. పోలీసులతో సైతం వాగ్వాదం జరిగింది. అనంతరం బలవంతంగా విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో ధరూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు సీడ్ కంపెనీలకు, ఆర్గనైజర్లకు అమ్ముడుపోయారని విజయ్‌కుమార్ ఆరోపించారు. ఇదిలాఉండగా, విత్తన పత్తి రైతులపై జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని, కంపెనీలు, ఆర్గనైజర్లు చేస్తున్న మోసాలను అరికట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. నడిగడ్డలో సీడ్ పత్తి రైతులు పడుతున్న దగాను వివరించారు. అనంతరం కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు.



అమరచింతలో మగ్గంపై జరి చీర నేస్తున్న కార్మికులు (ఫైల్)

చేనేత.. ఆర్థిక చేయూత

రూ.లక్ష రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం

- ఉమ్మడి జిల్లాలో 8,338 కార్మికులు.. 4,537 జియోట్యాగింగ్ మగ్గాలు
- రూ.6.50 కోట్ల అంచనా
- బ్యాంకర్లను నివేదిక కోరిన అధికారులు

అమరచింత: చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేస్తామని గతేదాది సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించగా.. ఇందుకు సంబంధించి తాజాగా జిల్లా అధికారులకు మార్గదర్శకాలు అందాయి. 2017, ఏప్రిల్ నుంచి 2024, మార్చి వరకు నేత కార్మికులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ కానున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని చేనేత కార్మికులకు ఆర్థిక ఊరట లభించినట్లయింది. ప్రభుత్వ ఆదేశాలతో మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల ఏడీ కార్యాలయాల పరిధిలో నేత కార్మికులు ఎంతమంది రూ.లక్ష రుణాలు తీసుకున్నారనే వివరాలను బ్యాంకు మేనేజర్లతో సేకరించి జాబితా రూపొందిస్తున్నారు. ఆ జాబితాను మరోమారు పరిశీలించి కలెక్టర్ల ఆధ్వర్యంలో డీఎల్‌సీ (జిల్లాస్థాయి కమిటీ) ఏర్పాటు చేసి స్టేట్ లెవల్ కమిటీకి నివేదించనున్నారు.

రూ.6.50 కోట్లకుపైగా రుణాలు..

ఉమ్మడి జిల్లాలో 4,537 జియోట్యాగ్ కలిగిన మగ్గాలు ఉండగా.. 8,338 మంది కార్మికులు నేత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మగ్గం పనిచేసే కార్మికులు ముద్ర యోజన, క్యాష్ క్రెడిట్, చేనేత మగ్గాల పేరున రుణాలు పొందారు. ఇలా చేనేతకు సంబంధించి సుమారు రూ.6.50 కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు గతంలో అధికారులు సేకరించిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కార్మికుడికి రూ.లక్ష రుణం మాఫీ చేస్తామని ప్రకటించడం, ఇందుకు సంబంధించిన విధి విధానాలు ఆయా జిల్లాల ఏడీలకు అందడంతో ప్రక్రియ వేగవంతంగా ముందుకు సాగుతోంది.

వేగంగా కొనసాగుతున్న ప్రక్రియ..

చేనేత కార్మికుల రుణమాఫీకి సంబంధించిన వివరాలను ఆయా చేనేత సహకార సంఘాల ద్వారా ఇదివరకే సేకరించిన జౌళిశాఖ అధికారులు తాజాగా మరోమారు ఏ బ్యాంకులో రుణాలు ఇప్పించారో అక్కడికే వెళ్లి రుణగ్రహీతల వివరాలు ఇవ్వాలని కోరుతున్నారు. రూ.30 వేలు, రూ.50 వేలు, రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న వారి వివరాలను సైతం సదరు ఏడీ కార్యాలయాల సిబ్బంది సేకరించే పనుల్లో లీనమయ్యారు. రెండు, మూడు రోజుల్లో జౌళిశాఖకు పూర్తి నివేదిక అందనుంది. వీటిని రాష్ట్రస్థాయి కమిటీకి అందజేసిన తర్వాత ప్రభుత్వం అర్హుల జాబితాను ప్రకటించనుంది.

ఇవీ మార్గదర్శకాలు..

- కలెక్టర్ చైర్మన్‌గా ఆరుగురితో కూడిన జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ) ఆమోదం పొందాలి. తర్వాత చేనేత డైరెక్టర్ చైర్మన్‌గా ఉన్న స్టేట్ లేవల్ కమిటీ ఆమోదం పొందితే బ్యాంకర్లు నో డ్యూ సర్టిఫికేట్ జారీ చేస్తారు.
- ప్రతి కార్మికుడికి వడ్డీతో కలిపి రూ.లక్ష వరకు రుణ మాఫీ అవుతుంది. అంతకుమించి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుంది.
- ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది.

రూ.50 వేలు అప్పు తీసుకున్నా..



నాలుగేళ్ల కిందట చేనేత వస్త్రాల ఉత్పత్తి కోసం బ్యాంకు నుంచి రూ.50 వేలు రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో సంతోష కలిగింది. ఏడాది నుంచి రుణమాఫీ ఎప్పుడు వర్తిస్తుందా అని ఎదురుచూస్తున్నా.
– స్వాతి, నేత కార్మికురాలు, గద్వాల

రుణ వివరాలు అందించాం..



చేనేత సహకార సంఘం ద్వారా బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న కార్మికుల వివరాలను జౌళిశాఖ అధికారులకు అందించాం. 2017 సంవత్సరంలో ముద్ర లోన్‌తో పాటు క్రెడిట్ కార్డు ద్వారా నేత కార్మికులకు రుణాలు ఇప్పించాం. ఇన్నేళ్లకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషం. – చంద్రమోహన్, అధ్యక్షుడు, చేనేత సహకార సంఘం

వివరాలు సేకరిస్తున్నాం..



చేనేత కార్మికులు 2017 నుంచి 2024 వరకు బ్యాంకుల్లో రూ.లక్షలోపు రుణం పొందిన కార్మికుల వివరాలను బ్యాంకు మేనేజర్లతో తీసుకుంటున్నాం. ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలతో రుణమాఫీ వర్తించే వారి జాబితాను రూపొందించి రాష్ట్రస్థాయి కమిటీకి నివేదించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. – గోవిందయ్య, ఏడీ, చేనేత, జౌళిశాఖ, గద్వాల

మగ్గాల కొనుగోలుకు..

కొత్త మగ్గాల కొనుగోలుకు డబ్బులు అవసరం ఉండి బ్యాంకు నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నా. క్రమం తప్పకుండా ప్రతిసారి రెన్యూవల్ చేశా. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తామనడంతో తీసుకున్న డబ్బులు మాఫీ అవుతాయనే సంతోషం ఉంది.
– పుట్టా సరిత, నేత కార్మికురాలు, గద్వాల

అందరికీ వర్తింపజేయాలి..

చేనేత కార్మికులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేసి విముక్తి కల్పించాలి. ముద్ర, క్రెడిట్ కార్డులతో పాటు వ్యక్తిగతంగా తీసుకున్న రుణాలను పరిగణలోకి తీసుకోవాలి. రూ.లక్షలోపు రుణాలు పొందిన వారి జాబితాను తయారుచేసి త్వరగా మాఫీ వర్తింపజేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలి. – అక్కల శాంతారం, జిల్లా కార్యదర్శి, చేనేత కార్మికుల సంఘం, గద్వాల

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యుల ఆందోళన



గద్వాల ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన పసికందు కుటుంబ సభ్యులు

గద్వాల క్రైం: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబసభ్యులు శుక్రవారం రాత్రి సదరు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా.. ధరూర్ మండలం రేవులపల్లికి చెందిన అశ్విని.. తన మూడు నెలల పాపకు జ్వరం రావడంతో వైద్య సేవల కోసం గద్వాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఈ నెల 11వ తేదీన తీసుకువచ్చింది. వైద్యులు ఆస్పత్రిలో జాయిన్ చేయించుకొని వైద్యం ప్రారంభించారు. కానీ, రోజులు గడుస్తున్నా పసికందు ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా పసికందు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దీంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే పసికందు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పరీక్షించి చెప్పారు. దీంతో రోదిస్తూ రాత్రి గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి పసికందు కుటుంబసభ్యులు చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతి చెందినట్లు వైద్యులను నిలదీస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడి శాంతిపజేశారు. బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయమై ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు అశోక్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. జ్వరంతో వచ్చిన పసికందుకు మెరుగైన వైద్యం అందించామని, ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదని, కానీ, బిడ్డకు తల్లి పాలు ఇవ్వవద్దని సూచించామని, అయినా పాలు ఇవ్వడంతో గొంతులో సమస్య ఏర్పడి పరిస్థితి విషమించిందని అన్నారు.

పెద్దధన్వాడలో రెవెన్యూ సదస్సు బహిష్కరణ

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు, కేసులు ఎత్తివేయాలని డిమాండ్



తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్ద ధన్వాడ గ్రామస్తులు

శాంతినగర్: ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజోళి మండలం పెద్ద ధన్వాడలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును గ్రామస్తులు బహిష్కరించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన రెవెన్యూ అధికారులను వెనక్కు వెళ్లాలని, ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని, రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేయకుండా, రైతులపై పెట్టిన కేసులు కొట్టివేసే దాక ప్రభుత్వ పరంగా నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించబోమని తేల్చిచెప్పారు. అంతేగాక తోటి రైతులు జైలు నుండి ఇంటికి వచ్చేదాకా గ్రామంలో ఎలాంటి పండుగలు జరుపుకోబోమని వెల్లడించారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో చేసేదిలేక రెవెన్యూ అధికారులు కార్యక్రమం నిర్వహించకుండానే వెనుదిరిగారు.

'ఉద్యాన' డిప్లొమాలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్లలోని ఉద్యాన కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పిడిగెం సైదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలీసెట్–2025 ర్యాంకు లేదా సమానమైన పరీక్షలోని ప్రతిభ ఆధారంగా ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 31.12.2025 నాటికి కనిష్టంగా 15 సంవత్సరాలు, గరిష్టంగా 22 ఏళ్ల వయస్సు ఉండాలని, 60 శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






ఉత్సాహంగా టీజీపీఈసెట్ ఈవెంట్స్

పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీజీపీఈ సెట్-2025 ప్రవేశ పరీక్షలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం 100 మీటర్ల రన్నింగ్ పోటీలను సెట్ కన్వీనర్ దిలీప్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన ఈవెంట్లు ఎంతో ప్రశాంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పరీక్షలు శనివారం మధ్యాహ్నంతో పూర్తి అవుతాయని వెల్లడించారు. ఈవెంట్స్‌లో బీపెడ్‌లో 403 మంది విద్యార్థులకు గాను 248 మంది, డీపెడ్‌లో 132 మంది విద్యార్థులకు గాను 72 మంది హాజరయ్యారు. రన్నింగ్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర ఈవెంట్స్ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

క్లుప్తంగా

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


ఉత్తమ్మ (ఫైల్)

అమరచింత: తెల్లవారుజామున టీ తాగేందుకు రోడ్డు దాటుతున్న వృద్ధురాలు హరిజన్ ఉత్తమ్మ (70)ను బొలేరో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉత్తమ్మ ఎస్సీకాలనీలో నివసిస్తోంది. తెల్లవారుజామున రోడ్డు పక్కనున్న హోటల్‌లో టీ తాగేందుకు వస్తుండగా సీసీరోడ్డు ఎక్కుతుండగా వడ్లలోడ్‌తో వేగంగా వస్తున్న బొలేరో ఢీకొట్టింది. దీంతో బొలేరో వెనుక టైర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సురేశ్ గ్రామంలోని సీసీ కెమెరాలోని పుటేజీలను పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు.


11 ఏళ్ల బాలుడు బలవన్మరణం


తమన్న చౌహాన్ (ఫైల్)

వెల్దండ: ఉరేసుకొని 11 ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. వెల్దండ మండలం బొల్లిగుట్టతండాకి కొర్ర శారద, కిషన్ దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. చిన్నకుమారుడు కొర్ర తమన్న చౌహాన్ (11) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో అమ్మమ్మ ఊరు కుందారం తండాలో ఉన్న తమన్నచౌహాన్ శుక్రవారం ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం నుంచి పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు ఆ బాలుడికి చెప్పి.. పత్తి విత్తనాలు నాటేందుకు పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటిపైన అలంకరణ కోసం ఏర్పాటు చేసే పైపులకు తాడుతో ఉరేసుకొని కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థి మరణంతో తండా విషాదంలో మునిగిపోయింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆత్మహత్య విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్‌ఏపీడీడీఆర్) పథకం కింద జిల్లాలో డీ-అడిక్షన్ సెంటర్లు (డీడీఏడీఎస్) ఏర్పాటు చేయడానికి అర్హత కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌తో పాటు జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట తదితర జిల్లాల్లో డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. డ్రగ్ డీ-అడిక్షన్ రంగంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండి.. అర్హత కలిగిన ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీఓలు), స్వచ్ఛంద సంస్థలు, ఇతర అర్హత కలిగిన సంస్థలు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం - సాధికారత శాఖ ఈ-అనుదాయ్ పోర్టల్ (https://grants&msje.gov.in/ngo&login) ద్వారా ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి సంస్థలు తప్పనిసరిగా ఎన్జీఓ దర్పన్ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని.. ఒకవేళ లేకపోతే దర్పన్ వెబ్‌సైట్ (https://ngodarpan.gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు మరిన్ని వివరాల కోసం టీజీఏఎన్‌బీ అవేర్‌నెస్ వింగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు (87126 61735), సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ (98859 38488)ను సంప్రదించాలని సూచించారు.



రక్తం ఇద్దాం.. ప్రాణం పోద్దాం

ఏ వస్తువునైనా మనిషి తన తెలివితేటలతో తయారు చేయగలడు. డబ్బుతో వాటిని కొనుగోలు చేయగలడు. కానీ మనిషి రక్తాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యం కాదు. వెలకట్టలేని రక్తాన్ని కేవలం మరో వ్యక్తి నుంచి మాత్రమే సేకరించాలి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణుల ప్రసవ సమయంలో, తలసేమియా, ఎనీమియా (రక్తహీనత) బాధితులకు రక్తం ఎంతో అవసరం పడుతుంది. అత్యవసర సమయంలో చేసే రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలుపుతుంది. అందుకే రక్తదానానికి అంతటి ప్రాధాన్యత ఏర్పడింది. శనివారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' **ప్రత్యేక కథనం..**

- పాలమూరు

అత్యవసర సమయంలో మానవత్వం చాటుతున్న దాతలు

- ప్రాణాపాయ స్థితిలో రక్తదానం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదు బ్లడ్ బ్యాంకులు
- పాలమూరులో మరో మూడు ప్రైవేటు రక్తనిధి కేంద్రాలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు ఐదు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు, పాలమూరు పట్టణంలో మూడు ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. రోజు 100 నుంచి 150 మందికి రక్తం అవసరం పడుతుంది. ప్రధానంగా ఇటీవల రోడ్డు ప్రమాద కేసులు గణనీయంగా పెరిగాయి. వీరితో పాటు ప్రసవం కేసులు, రక్తహీనత కేసులకు సైతం రక్తదాతల నుంచి తీసిన రక్తం అవసరం పడుతుంది. జనరల్ ఆస్పత్రి, రెడ్‌క్రాస్‌లో రక్తనిధి కేంద్రాల్లో నిల్వలు తగ్గుముఖం పట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. జనరల్ ఆస్పత్రిలో 500 యూనిట్ల వరకు రక్తాన్ని నిల్వ ఉంచే సామర్థ్యం ఉంది. కానీ ప్రతినెలా 250 నుంచి 350 యూనిట్లు అవసరం ఉండటంతో అదే స్థాయిలో రక్తాన్ని సేకరిస్తున్నారు. అయితే బ్లడ్ బ్యాంక్‌ల్లో ఒక్కోసారి రక్త నిల్వలు లేకుండా పోతుండటంతో అత్యవసర సమయాల్లో దాతల నుంచి రక్తాన్ని సేకరించాల్సి వస్తుంది. అదీ కూడా అవసరమున్న వ్యక్తులు దాతలను తీసుకొస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.


మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉన్న రక్తం

తెలుసుకోవాల్సిన అంశాలు..

- ఆరోగ్యవంతులై 18-60ఏళ్ల వయసు గల వారు రక్తదానం చేయడానికి అవకాశం ఉంది. మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు. ఒక వ్యక్తి శరీరంలో దాదాపు పది యూనిట్ల రక్తం ఉంటుంది. రక్తదానం సందర్భంగా ఒక యూనిట్ దానం చేస్తారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలనే అయితే రెండు నెలలకోమారు దానం చేయవచ్చు.
- రక్తదానం చేసే వారు 45కేజీల బరువు ఉండాలి. అంతకంటే తక్కువ బరువు కలిగిన వారు రక్తదానం చేయకపోవడం మంచిది.
- శరీర ఉష్ణోగ్రత, బీపీ పల్స్‌రేట్ వంటివి సాధారణ స్థాయిలో ఉండాలి.
- హిమోగ్లోబిన్ కనీసం 12.5 గ్రాములకు తక్కువ కాకుండా ఉండాలి.

రక్తదానం ఎవరు చేయరాదు..

- మాములుగా రక్తదానం శ్వాసకోశ వ్యాధులున్న వారు, క్యాన్సర్, గుండె జబ్బులు, ఉన్నట్టుండి బరువు తగ్గడం, డయాబెటిస్, హెపటైటిస్, ఆస్తమా, ఎపిలెప్సీ, కాలేయ వ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు కలిగిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ఉన్న వారు రక్తదానం చేయరాదు.
- దగ్గు, జలుబు, జ్వరం వంటి అస్వస్థత కలిగిన వారు, ఏదైనా చికిత్సలో భాగంగా మందులు వాడుతున్న వారు ఆ విషయాల్ని వైద్యులకు చెబితే వారు ఎప్పటి వరకు రక్తదానం చేయరాదనే విషయం చెబుతారు.
- మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు చికిత్స పొందిన వారు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకు రక్తదానం చేయడానికి వీలులేదు.

అరుదైన గ్రూపులు..

రక్తంలో ఏ, బీ, ఏబీ, ఓ పాజిటివ్, నెగెటివ్ గ్రూపులు ఉంటాయి. వీటిలో పాజిటివ్ గ్రూపులు ఎక్కువగా ఉంటాయి. నెగెటివ్ గ్రూపులు చాలా అరుదుగా ఉంటాయి. ఏబీ నెగెటివ్ వేల మందిలో ఒకరు, ఇద్దరు మాత్రమే ఉంటారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లో రక్తం తీసుకునే ముందు హెచ్‌బీ శాతం, హెచ్ఐవీ పరీక్షలు రిపోర్టు, క్రాస్ మాచింగ్ రిపోర్టు ఉందో లేదో సరిచూసుకోవాలి.

- సాధారణంగా మూడు రకాల బ్లడ్ గ్రూప్‌లను అధికంగా వినియోగించడం జరుగుతుంది. ఏ, బీ, ఓ పాజిటివ్ గ్రూప్‌లను రక్తదాన శిబిరాల్లో ఎక్కువగా రక్తదాతలు ఇస్తారు. ఏ-బీ నెగెటివ్ గ్రూప్ చాలా అరుదుగా లభ్యం అవుతాయి. జనరల్ ఆస్పత్రిలో ఉన్న బ్లడ్‌బ్యాంకు నుంచి ఉమ్మడి జిల్లాతో పాటు కొడంగల్, తాండూర్, వికారాబాద్‌ల నుంచి రెఫర్ కేసులు వస్తాయి. రక్తం ఎక్కువగా గైనిక్, రోడ్డు ప్రమాదం కేసులకు, తలసేమియా, ఎనీమియా (రక్తహీనత) కేసులకు అవసరం పడుతుంది.

మూడేళ్ల కాలంలో జనరల్ ఆస్పత్రిలో రక్త సేకరణ ఇలా..

సంవత్సరం	క్యాంపులు	సేకరణ (యూనిట్లలో)
2023	30	3,500
2024	28	3,400
2005	16	1,200
రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో		
2023-24	162	6,289
2025	20	2129

2003లో మొదటిసారిగా..



నేను లయన్స్ క్లబ్ సభ్యుడిగా ఉన్న క్రమంలో 2023లో మొదటిసారి రక్తం ఇచ్చాను. 18ఏళ్ల కాలంలో 57సార్లు రక్తదానం చేశాను. బీ-నెగెటివ్ బ్లడ్ గ్రూప్ వందలో పది మందికి మాత్రమే ఉంటుంది. చాలా అరుదుగా లభ్యం అవుతుంది. గుండెకు సంబంధించిన బైపాస్ సర్జరీలు చేస్తున్న క్రమంలో అత్యవసరం ఉన్న ఐదు నుంచి ఆరుగురికి ఆస్పత్రికి వెళ్లి రక్తం ఇచ్చాను. ఓసారి ప్రసవం కోసం వచ్చిన మహిళకు అత్యవసరంగా రక్తం కావాల్సి వస్తే.. వెళ్లి ఇవ్వగా ఆమె ప్రాణాలు నిలిచాయి. అదే విధంగా 15సార్లు రక్తదాన శిబిరాలు సైతం నిర్వహించాను.

- కెంగూరి శ్రీకాంత్ యాదవ్, దేవరకద్ర

అత్యవసర సమయంలో..



నేను ఐటీఐ చదువుతున్న **సమయంలో కల్వకుర్తి** వద్ద జరిగిన **రోడ్డు ప్రమాదంలో** 10ఏళ్ల బాలికకు **తీవ్ర గాయాలు కాగా..** బీ-నెగెటివ్ **రక్తం అత్యవసరం** ఉందని **స్నేహితుడి ద్వారా** సమాచారం **తెలుసుకుని ఆస్పత్రి**కి వెళ్లి ఇచ్చాను. ఇప్పటి వరకు **7సార్లు రక్తదానం చే**శాను. అత్యవసరం ఉందని ఫోన్ చేస్తే **తప్పక వెళ్లి ఇస్తాను.**

- శేఖర్ యాదవ్, నవాబుపేట

ఎదుటి వ్యక్తి ప్రాణం కాపాడాలి..



రక్తదానంతో ఎదుటి వ్యక్తి ప్రాణం కాపాడిన వాళ్లం అవుతాం. ఏ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కల్గిన నేను ఇప్పటి వరకు 48సార్లు రక్తదానం చేయడంతో పాటు ఎంతో మందిని ప్రోత్సహించి రక్తదానం చేయించాను. ఒకసారి ప్లాస్మాదానం కూడా చేశాను. లయన్స్ క్లబ్‌తో కలిసి ఎన్నోసార్లు రక్తదాన శిబిరాలపై అవగాహన కల్పించాను.

- రంగినేని మన్మోహన్, హెడ్‌కానిస్టేబుల్

రాష్ట్రంలో ప్రథమ స్థానంలో..



రాష్ట్రంలోనే 157సార్లు రక్తదానం చేయడంతో పాటు 8 సార్లు ప్లాస్మా, 8సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయడం జరిగింది. నేను 1983 నుంచి రక్తదానం చేయడం మొదలుపెట్టాను. అప్పటి నుంచి ప్రతి మూడు నెలలకు ఓసారి రక్తదానం చేస్తున్నాను. రెడ్‌క్రాస్ నుంచి ఈ ఏడాది 162 క్యాంపులు నిర్వహించి 6,289 రక్త యూనిట్లు సేకరించాం. ప్రస్తుతం రెడ్‌క్రాస్‌లో ఎస్‌డీపీ మిషన్ అందుబాటులోకి తెచ్చాం. ప్లేట్‌లెట్స్ తగ్గిన వారికి రెడ్‌క్రాస్‌లో ఎక్కించడానికి కావాల్సిన శిక్షణ కూడా సిబ్బందికి ఇప్పించాం.

- లయన్ నటరాజ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

39సార్లు రక్తదానం..




జిల్లా జనరల్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాను. ఈ క్రమంలో చాలా అత్యవసరం ఉన్న రోగులకు రక్తదానం చేశాను. ఇప్పటి వరకు 39సార్లు రక్తదానం చేయడం జరిగింది. బ్లడ్‌బ్యాంకులో పని చేయడం వల్ల రక్తం విలువ తెలుసుకొని నా వంతు బాధ్యతగా రక్తదానం ఇవ్వడం మొదలుపెట్టాను.

- కోటేశ్వర్‌రెడ్డి, బ్లడ్‌బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్, జిల్లా జనరల్ ఆస్పత్రి

ప్రైవేటు స్కూల్స్ నిర్వాకం

- అడ్డగోలుగా వ్యవహరిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలు
- హైస్కూల్ అనుమతి లేకపోయినా తరగతులు బోధించిన ప్రియదర్శిని
- మరో పాఠశాల పేరు మీద ఎన్ఆర్స్, ఈటీసీ పెట్టినట్లు గుర్తింపు
- ఇది వరకే ఆ రెండింటికి షోకాజ్ నోటీసులు ఇచ్చిన విద్యాశాఖ
- విచారణకు వెళ్లినప్పుడు 8 నుంచి 10వ తరగతి వారికి తరగతుల నిర్వహణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు చేసే పనులకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. తాము ఏం చేసినా చెల్లుతుందిలే అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అసలు హైస్కూల్‌కు అనుమతులే లేకున్నా.. నేరుగా 8 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుని విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారు. అడ్మిషన్లు చేసుకుని ఏకంగా తరగతులు సైతం బోధించడంతో విచారణకు వెళ్లిన అధికారులు అవాక్కయ్యారు. పాఠశాలల్లో వసతులు, నిబంధనల ప్రకారం నిర్వహణ లేకపోవడం, యూనిఫాంలు, పుస్తకాలు అమ్మడం, అర్హులైన ఉపాధ్యాయులు లేకపోవడం ఒక ఎత్తయితే అసలు హైస్కూల్‌కు అనుమతులు లేని ప్రైమరీ పాఠశాలలో హైస్కూల్ అడ్మిషన్లు తీసుకుని నిర్వహించడం మరో ఎత్తు. ఇదీ ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న అడ్డగోలు వ్యవహారాలకు పరాకాష్టగా మారింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ తతంగం.. గత ఏప్రిల్‌లో ఓ విద్యార్థి సంఘాల నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తాజాగా బయటికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు అనేక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


PROCEEDINGS OF THE DIST. EDUCATIONAL OFFICER: MAHABUBNAGAR

SHOW CAUSE NOTICE

శ్రీప్రతిభ పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఇచ్చిన నోటీసులు

శ్రీప్రతిభ, ప్రియదర్శిని పాఠశాలలకు నోటీసులు..

మహబూబ్‌నగర్ పట్టణంలోని మోనప్పగుట్ట ప్రియదర్శిని పాఠశాలకు కేవలం ప్రైమరీ స్కూల్ నిర్వహించేందుకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ, ఏకంగా 8 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏప్రిల్‌లో ఈ విషయమై ఓ విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదు చేయడంతో విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 8వ తరగతిలో 10, 9వ తరగతిలో 12, 10వ తరగతిలో 12 మంది విద్యార్థులు తరగతులు వింటున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా సదరు పాఠశాలకు కేవలం 1 నుంచి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు నోటీసుల్లో స్పష్టం చేశారు. ఇదే విషయమై గతంలో శ్రీప్రతిభ స్కూల్‌కు కూడా డీఈఓ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇందుకు ప్రధాన కారణంగా పాఠశాల నిర్వహిస్తున్నది ప్రియదర్శిని పాఠశాల కాగా ఎస్సెస్సీ విద్యార్థులకు ఇచ్చే నామినల్ రోల్స్, ఈటీసీ వంటి శ్రీప్రతిభ పాఠశాలకు చెందినవిగా అధికారులు అక్కడ గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు ఇచ్చారు. వెంటనే సమాధానం చెప్పాలని గతంలో ఈ పాఠశాలకు నోటీసులు ఇస్తే స్పందించలేదని అధికారులు పేర్కొంటున్నారు. మరోసారి గత నాలుగైదు రోజుల క్రితం నోటీసులు ఇచ్చామని నిర్ణీత సమయంలో సమాధానం ఇవ్వాలని, ఇవ్వని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

ఇది చివరి నోటీసు..



గతంలో ప్రియదర్శిని పాఠశాలలో అనుమతులు లేకుండా హైస్కూల్ విద్యార్థులకు బోధించడం, అక్కడే హాస్టల్ నిర్వహించడం వంటి వాటిపై ఫిర్యాదులు రావడంతో ఎంఈఓ విచారణ రిపోర్టు ఆధారంగా నోటీసులు ఇచ్చాం. ఈ పాఠశాలలకు ఓపెనింగ్ పర్మిషన్, నామినల్ రోల్స్ శ్రీప్రతిభ పాఠశాలకు చెందినవిగా గుర్తించి ఆ పాఠశాలకు గతంలో నోటీసు ఇచ్చినా స్పందించలేదు. మళ్లీ ఇప్పుడు మరోసారి నోటీసులు ఇచ్చాం. నిర్ణీత గడువులోగా నోటీసులకు స్పందించకపోతే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. శ్రీప్రతిభ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నారని కూడా ఫిర్యాదులు వచ్చాయి. దానిపై నోటీసులు ఇచ్చాం. తదుపరి చర్యలు ఉంటాయి.

- ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో

ధరూరు /ఆత్మకూరు/దోమలపెంట/శాంతినగర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు నిలకడగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రంలో 4 యూనిట్‌లలో విద్యుదుత్పత్తిని చేపట్టారు. ఇందుకోసం 15వేల 241 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1500 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 17,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

37.424 ఎంయూ విద్యుదుత్పత్తి

ఎగువలో 2 యూనిట్లద్వార 78 మెగావాట్లు 17.808 మిలియన్ యూనిట్లు, దిగువలో 2 యూనిట్లద్వార 80 మెగావాట్లు 19.616 మిలియన్‌యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని ఎస్ఈ శ్రీధర్ అన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 37.424 మిలియన్‌యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

శ్రీశైలంకు 37,136 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.

జూరాలలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 15,241 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 21,895 మొత్తం 37,136 క్యూసెక్కుల నీటి ప్రవాహం శుక్రవారం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 836.7 అడుగుల వద్ద 57.1874 టిఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజికెఎల్ఐకు 326 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.641 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 7,860, ఎపి.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 1.308 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 2,695 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు.

సుంకేసుల 3 గేట్లు ఎత్తివేత

రాజోళి సమీపంలోని సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎగువన కురుస్తున్న మోస్తరు వర్షాలతో బ్యారేజీకి 13,296 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 1.110 టీఎంసీలు నిల్వ వుంచుతు 3 గేట్లు మీటరు ఎత్తి దిగువకు 13,137 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.